మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# అమిత్‌షాను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

- అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన
- మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



నిరసన తెలుపుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్ డిసెంబర్ 19 ప్రభాత వార్త:** రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ను వెంటనే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని మఖ్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం అసెంబ్లీ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి నిరసన చేపట్టారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే అమిత్ షా కేంద్ర మంత్రి అయ్యారని గుర్తు చేశారు. అమిత్ షాను తప్పించాలని డిమాండ్ చేస్తే బీజేపీ ఎంపీలు చేసిన తోపులాటతో లోక్ సభలో ప్రతి పక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోకాలికి గాయం అయిందని వాపోయారు. అమిత్ షాపై చర్యలు తీసుకునే వరకు తాము నిరసన బాట పడతామని హెచ్చరించారు.

## ధరణి దరఖాస్తులు

# పెండింగ్ ఉంచొద్దు

**రెవెన్యూ గ్రామాల వారీగా బ్యాంకుల నిర్వహణ**

**క్షేత్రస్థాయిలో భూముల వివరాలు పరిశీలించాలి**

**కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో డిసెంబరు 19 ప్రభాతవార్త:** ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ శాఖ కు సంబంధించి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాల వారీగా ధరణి దరఖాస్తుల పెండింగ్ పై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఇసుక అక్రమ రవాణా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి వనరుల భూములు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ విలేజ్‌ల వారీగా బ్యాంకుల నిర్వహణ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ భూమి యొక్క స్థితిగతులను వాటి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో పొందుపరచాలని కోరారు. సీలింగ్ ల్యాండ్ అసైన్మెంట్ దేవాదాయ ఇనాం వక్ఫ్ భూములు వివరాలను పొందుపరచాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అర్.డి.ఓ నవీన్‌లు పాల్గొన్నారు.

## నిర్మాణపు పనులన్నీ వేగవంతంగా

# పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, డిసెంబరు 19 ప్రభాతవార్త :** జిల్లాలో చేపట్టిన నిర్మాణపు పనులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ శాఖల ఈఈలు, డీ.ఈలతో, టీఎస్ఎంఐడీసీ, ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులను పనుల పురోగతికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మంజూరైన వివిధ నిర్మాణపు పనుల పురోగతిని, అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈడబ్ల్యూఐడీసీ పరిధిలోగల నిర్మాణపు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ముఖ్యంగా కేజీబీవీ రాజోలీ, బాలసధన్ పూర్తి చేసి, నెలవారీ పురోగతి నివేదికలను అందించాలని ఆదేశించారు. టీఎస్ఎంఐడీసీ అధికారులను మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, క్రిటికల్ కేర్, సబ్ సెంటర్ల అసంపూర్తిగా ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫెడ్.డిఆర్ పనులు, రోడ్ల పనులు, విస్తరణ పనులు, బీటీ రోడ్లు, కనెక్టివిటీ, సీసీ రోడ్లను, భవనాల నిర్మాణపు పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను సూచించారు. గ్రామాల్లో పెండింగ్ పనులను పర్యవేక్షించి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అన్ని శాఖలు తమ పరిధిలో ఉన్న పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మంజూరు అయినా పనులన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. చేపట్టిన పనులను త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని, పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సి.ఈ.ఓ కాంతమ్మ, టిఎస్ఎంఐడిసి డి.ఈ శ్రీనివాసులు, ఈ.ఈ పీ.ఆర్ దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈ.ఈ ప్రగతి, ఎ.ఈలు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత

**జిల్లాలో విద్యా వికాసానికి సహకారం అందిస్తాం**

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా జి.చిన్నా రెడ్డి**



సీఎం కప్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 19 ప్రభాతవార్త :** చదువుతో పాటు క్రీడలకు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా జి.చిన్నా రెడ్డి అన్నారు. డిసెంబర్ 17 నుండి 19 వరకు నిర్వహించిన ముఖ్యమంత్రి కప్ క్రీడల ముగింపు కార్యక్రమం గురువారం స్థానిక బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ముఖ్య అతిథిగా చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలకు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని అప్పుడే జీవితంలో రాణిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా ఫుట్ బాల్ క్రీడాకారుడని, వనపర్తిలోనే విద్యాభ్యాసాలు పూర్తి చేసి ఇక్కడే ఇదే మైదానంలో ఆటలు ఆడుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉంటూ హైదారాబాద్ లోని హెచ్.ఆర్.డి. క్యాంపస్ లో క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసుకొని పక్కనే ఫుట్బాల్ మిదానం ఏర్పాటు చేయించి ప్రతి రోజూ గంట సేపు ఫుట్బాల్ ఆడుతారని దీనిని బట్టి ముఖ్యమంత్రి క్రీడలకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తారో అర్థమవుతుందన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి సైతం వనపర్తి జిల్లా వాసి అని చెప్పారు. వనపర్తి జిల్లాలో అనేక విద్యాలయాలు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఉద్బోధించారు. ఇప్పుడు క్రీడలు నిర్వహిస్తున్న క్రీడా ప్రాంగణం ఒకప్పుడు చవుడు భూమిగా ఉండేదని క్రీడా మైదానం తీర్చిదిద్దడంలో తనవంతు పాత్ర సైతం ఉందని తెలిపారు. జిల్లాలో విద్యా వికాసానికి తనవంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కప్ కు నెల రోజుల నుంచి సన్నాహకాలు చేసి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నేడు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. మొత్తం 36 క్రీడా విభాగాల్లో క్రీడలు నిర్వహించగా 3600 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్ 27 నుండి రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో పాల్గొనేటప్పుడు ఒక వ్యక్తిగా కాకుండా తాను వనపర్తి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం మరచిపోవద్దని గుర్తుచేశారు. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. ఓడిన వారు కృంగిపోకుండ మరింత పట్టుదలగా ఆడి గెలుపొందాలని ఉద్బోధించారు. అనంతరం క్రీడల్లో మొదటి, రెండవ, తృతీయ స్థానంలో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, కప్‌లు బహుకరించారు.




బహుమతి ప్రధానోత్సవం జి చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

# ఎన్నికల విధులపై అవగాహన కలిగి ఉండాలి

**మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి**

**నోడల్ అధికారులతో సమీక్ష**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 19 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులు తమ విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ రెండవ సాధారణ ఎన్నికలు 2025 నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ననుసరించి త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వివిధ విభాగాలలో 12 మంది నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. మ్యాన్ పవర్ మేనేజ్ మెంట్ నోడల్ అధికారిగా రెవెన్యూ డివిజనల్ అధికారిని, బ్యాలెట్ బాక్స్ ల నిర్వహణ నోడల్ అధికారిగా జిల్లా పశు సంవర్ధక అధికారిని, ట్రాన్స్పోర్ట్ నోడల్ అధికారిగా జిల్లా రవాణా అధికారిని, శిక్షణా నోడల్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారిని, మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని, మోడల్ కోడ్ అమలు, ఖర్చు అకౌంట్ నిర్వహణ నోడల్ అధికారిగా డిఆర్‌డిఓ ను, ఎన్నికల వ్యయం పర్యవేక్షణ నోడల్ అధికారిగా జిల్లా సహకార అధికారిని, అబ్జర్వర్ల నోడల్ అధికారిగా జిల్లా పౌర సరఫరాల అధికారిని, బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా జడ్పీ సిఈఓ ను, మీడియా కమ్యూనికేషన్ నోడల్ అధికారిగా జిల్లా పౌర సంబంధాల అధికారిని, హెల్ప్ లైన్ ఫిర్యాదుల పరిష్కారం నోడల్ అధికారిగా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌ను, రిపోర్ట్స్, రిటర్న్స్ నోడల్ అధికారిగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని నియమించినట్లు తెలిపారు. నోడల్ అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా పనుల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డి.పి.ఓ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## తెలంగాణ వరి ధాన్యం

# కర్ణాటలోకి రానివ్వం

**కర్ణాటక రాష్ట్ర రైతు సంఘాలు**



నిరసన తెలుపుతున్న కర్ణాటక రైతులు

**కృష్ణ, డిసెంబరు 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో పండించిన వడ్లను కర్ణాటక రాష్ట్ర మార్కెట్‌లో అమ్ముకోవడానికి విడిచి పెట్టబోమని రాయచూర్ జిల్లా రైతు సంఘాల నాయకులు నిరసనకు దిగారు. నారాయణపేట జిల్లా కృష్ణా మండల కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర సరిహద్దున కృష్ణ నది బ్రిడ్జ్ పై గురువారం ఉదయం కర్ణాటక రైతు సంఘాల నాయకులు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక వరి ధాన్యానికి రాష్ట్రంలోకి రానివ్వకుండా నిర్బంధం చేయడంతో కర్ణాటక, రాయచూరు, యాదగిరి జిల్లాల రైతు సంఘాలు వందలాది వరి ధాన్యపు లారీలను ట్రాక్టర్లను రోడ్డుపై ఆపి నిరసన తెలిపారు, కర్ణాటక ప్రభుత్వం , తెలంగాణ ప్రభుత్వం ఇరు రాష్ట్రాల్లో పండించిన ధాన్యాలను క్రయవిక్రయాలు జరుపుకోవడానికి అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే కర్ణాటక రాష్ట్రంలో తెలంగాణలో పండించిన వరి ధాన్యాన్ని రానివ్వకుండా అడ్డుకట్టు వేస్తామని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు, వెంటనే ప్రభుత్వాలు స్పందించి దీనిపై త్వరలోనే చర్యలు చేపట్టాలని లేనియెడల ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు, ఈ సందర్భంగా వరి లారీ ట్రాక్టర్లతో పాటు ఇతర వాహనాలు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

## విద్యార్థులతో కలిసి సహపంక్తి

# భోజనం చేసిన కలెక్టర్

- ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- మెనూ ప్రకారం భోజనాన్ని అమలు చేస్తున్నారా లేదా అని పరిశీలించిన కలెక్టర్
- మధ్యాహ్న భోజనం అమలు తీరులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్

**కల్వకుర్తి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం మరియు చదువు అత్యంత ప్రాధాన్యమైనవని కలెక్టర్ తెలిపారు. పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి - మిగతా4లో..

# అర్ధరాత్రి ట్రీ పార్క్ చెట్లు ధ్వంసం

**నిందితులను వెంటనే శిక్షించాలి అఖిలపక్షం డిమాండ్**

**పెబ్బేరు డిసెంబరు 19 ప్రభాతవార్త :** పట్టణంలో జర్నలిస్ట్ కాలనీ దగ్గర ఉన్న పార్క్ లోని చెట్లను అర్ధరాత్రి ధ్వంసం చేసినట్లు అఖిలపక్షం నాయకులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. పట్టణంలోని పిజెపి కెనాల్ పక్కన జర్నలిస్ట్ కాలనీ పార్క్‌లోని ప్రకృతి వనం పేరిట కొన్ని లక్షల రూపాయలు ఖర్చు చేసి మున్సిపల్ వాళ్లు పార్కును ఏర్పాటుచేయగా, పురకమిషనర్ పర్మిషన్ లేకుండా అర్ధరాత్రి పచ్చని చెట్లను తొలగించారని విషయం తెలుసుకున్న పట్టణ ప్రముఖులు అఖిలపక్షం నాయకులు ఘటన స్థలాన్ని పరిశీలించి గతంలో ఈ స్థలాన్ని రెండు ఎకరాల 20 గుంటలు మాజీ సర్పంచ్ అక్కి సుశీల శ్రీనివాస్‌గౌడ్ ఆడిటోరియంకోసం తీర్మానం చేశారని, కానీ మున్సిపల్ పాలకవర్గం వచ్చాక వారి ఆధీనంలో ట్రీ పార్క్ కొన్ని లక్షలు ఖర్చు చేసి ఎంతో అందంగా తీర్చిదిద్దినా పార్కును ధ్వంసం చేయడంతో లక్షల రూపాయలు బురదలో పోసిన పన్నీరుగా మిగిలిపోయిందని వారు ఆరోపించారు. దీనికి కారణమైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని వనపర్తి కలెక్టర్‌కు, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, అఖిలపక్ష నాయకులు, యువజన సంఘాల నాయకులు, తదితరులు దీనిపై స్పందించారు.



ధ్వంసం చేసిన పార్క్‌ను పరిశీలిస్తున్న నాయకులు

# ఐటి టవర్ నిర్మాణానికి రూ.22కోట్లు మంజూరు

**ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కృషి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు19 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణ సమీపంలోని సర్వేనెంబర్ 167లో ఐటి టవర్ నిర్మాణానికి రూ.22కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఐటి టవర్ నిర్మాణానికి మాజీమంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఆ ఐటిటవర్ నిర్మాణానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలోనే ఈ ఐటి టవర్ నిర్మాణానికి సంబంధించి - మిగతా4లో..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

# అర్హులైన రైతులకు పీఎం కిసాన్ యోజన..

**నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలో అర్హులైన రైతులకు పీఎం కిసాన్ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యవసాయ అధికారులకు పీఎం కిసాన్ సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం, దీని లక్ష్యం చిన్న మరియు సన్నకారు రైతులందరికీ సంవత్సరానికి రూ.6వేల వరకు కనీస ఆదాయ మద్దతును అందించడం అని తెలిపారు. పీఎం కిసాన్ పథకం కింద, వారి పేరు మీద సాగు భూమి ఉన్న అన్ని రైతు కుటుంబాలకు, వారి భూమి పరిమాణంతో సంబంధం లేకుండా సంవత్సరానికి రూ.6,000 ఆదాయ మద్దతు లభిస్తుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వివరించారు. ఈ పథకం రైతులకు వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలకు మరియు వారి గృహ అవసరాలకు సంబంధించిన అనుబంధ ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2019వ సంవత్సరానికి సంబంధించిన పాస్ పుస్తకాలు కలిగి ఉండి అర్హులైన రైతులకు పీఎం కిసాన్ సమృద్ధి యోజన పథకం ద్వారా లబ్ధి చేకూరిలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు నాగర్ కర్నూలు జిల్లాలో 1,94,908 మంది రైతులకు పీఎం కిసాన్ సమృద్ధి యోజన పథకం ద్వారా ఇప్పటివరకు 565.22 కోట్ల రూపాయల నగదు రైతుల అకౌంట్లో డబ్బులు జమ అయ్యాయని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందించే పీఎం కిసాన్ సమృద్ధి యోజన పథకం కింద జిల్లాలో అర్హులైన రైతులను గుర్తించి నమోదు ప్రక్రియను వేగవంతం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కేవైసీని తప్పనిసరిగా చేయించాలని అన్ని పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులకు పథకంపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలని సూచించారు. పిఎం కిసాన్ యోజన కింద, ప్రభుత్వం అర్హులైన రైతులకు ఒక్కొక్కరికి రూ. 2000 చొప్పున మూడు సమాన వాయిదాలలో సంవత్సరానికి రూ. 6000 ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని, కలెక్టర్ తెలిపారు ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

# ఊక చెట్టు వాగే మాకు జీవనాధారం

**అడిషనల్ కలెక్టర్ ముందు గోడు వెళ్ళబోసుకున్న కురుమూర్తి గ్రామ రైతులు**

**చిన్న చింతకుంట, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఇటీవల తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ మండలంలోని ఊక చెట్టు వాగు పరిసర ఐదు గ్రామాలలో ఇసుక రీచ్‌లను గుర్తించి జిల్లా కేంద్రానికి ఇసుకను తరలించేందుకు కురుమూర్తి గ్రామ సమీపంలోని వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక తీసేందుకు హిటాచిలను ఉంచడంపై నాలుగు రోజుల క్రితం కురుమూర్తి గ్రామ రైతులు అడ్డుకున్నారు. గురువారం అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీవో నవీన్‌కుమార్, మైనింగ్ ఏడి సంజయ్ లు గ్రామానికి చెందిన కొందరు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, గ్రామ రైతు కథలప్ప యాదవ్ అధికారులతో మాట్లాడుతూ 1976 నుంచి ఈ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు ఇక్కడి ఇసుకపై ఒక్కరోజు కూడా మాట్లాడలేదు. సుమారు 50 సంవత్సరాల పైగా వాగులోని ఇసుకను కాపాడుకుంటూ ఈ ప్రాంత రైతులందరము వాగు జలాలపై ఆధారపడుతూ జీవిస్తున్నామని అధికారుల ముందు గోడువెళ్లబోసుకున్నారు. వాగులో ఇసుక తరలిపోతే భూగర్భ జలాలు అడుగంటి పంటలు పండక ఈ ప్రాంత రైతులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. వాగులో మెండుగా ఇసుక ఉండటం వల్ల భూగర్భజలాలు పదిలంగా ఉంటూ సుమారు ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు ఉంటూ బోర్లు పుష్కలంగా నీరు వస్తున్నడంతో పంటలు సమృద్ధిగా పండి రైతులను ఆనందంగా జీవిస్తున్నామని, గత ప్రభుత్వహయాంలో అప్పటి ఎమ్మెల్యే ఇసుకను తరలించేందుకు ప్రయత్నం చేయగా రైతులందరము అప్పటి ఎమ్మెల్యేను కలిసి ఇసుకతరలిస్తే ఇబ్బందులను ఆయనదృష్టికి తీసుకెళగా ఇసుక తరలింపును నిలిపేశారని అధికారులకు వివరించారు. ఊకచెట్టు వాగు పరిసర గ్రామాలైన బండరుపల్లి, లాలుకోట, నెల్లి కొండి, పల్లమర్రి, వడ్డేమాన్, చిన్నవడ్డేమాన్, ఎద్దులాపూర్, చిన్నచింతకుంట, మద్దూర్, అల్లిపూర్, కురుమూర్తి, అమ్మాపూర్, గూడూరు, తిరుమలాపూర్, దాసరపల్లి, అప్పంపల్లి, ముచ్చింతల తదితర గ్రామాల ప్రజలు త్రాగు, సాగు నీటికై వాగులోని జలాలపై ఆధారపడి జీవిస్తున్నారని ఇప్పటికైనా అధికారులు మా ప్రాంతం నుంచి ఇసుక తరలింపును నిలిపివేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఊక చెట్టు వాగు పరిసర గ్రామాల చుట్టూ చెరువులు లేవని వాగు పైనే ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్నామని మా అవసరాల నిమిత్తం మాత్రమే ఇసుకను తీసుకుంటున్నాం తప్ప ఇతర ప్రాంతాలకు - మిగతా4లో..



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓ, ఇతర అధికారులు

## మాల మహానాడు కార్యవర్గం ముందస్తు అరెస్ట్

**మక్తల్ టౌన్, డిసెంబరు19 ప్రభాతవార్త :** మాలమహానాడు మక్తల్‌మండల కార్యవర్గాన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. మండల అధ్యక్షుడు బాలు బండారి రిజర్వేషన్ అడ్డుకునేందుకు చలో అసెంబ్లీ పిలుపు మేరకు ముందస్తు అదుపులోకి తీసుకొని నిలువరించారు. ప్రభుత్వం పాసిస్ట్ విధానాలు అవలంబిస్తున్న తీరు శోచనీయం అని బండారి బాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని ఇలాంటి అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు అని పేర్కొన్నారు.



ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

మాల మహానాడు మండల క్రియాశీల కార్యకర్త బండారి ఆనంద్ మాట్లాడుతూ పోలీసులు ప్రభుత్వం కు వత్తాసు పలుకుతూ ఏకపక్షంగా ఉండటం సబబు కాదని ప్రజాపక్షం ఉండాలని హితవు పలికారు. అరెస్ట్ అక్రమం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దళిత ఉద్యమాలను అణచివేత తో నియంతను తలపిస్తుంది అని ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బండారి చెన్నప్ప, బండారి మాధవ్, బండారి బసప్ప, బండారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ సాగుతో అధిక లాభాలు

### నాగర్‌కర్నూల్ ఏరియా మేనేజర్ రాకేష్

**ఉప్పునుంతల, డిసెంబరు 19 ప్రభాతవార్త :** రైతులు కాల అనుగుణంగా వ్యవసాయ పొలాలలో పామాయిల్ పంటలు సాగు చేసుకుని అధిక లాభాలు పొందవచ్చని నాగర్ కర్నూల్ ఏరియా మేనేజర్ రాకేష్ రై తులకు అవగాహన కల్పించారు. గురు వారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో సాగు చేసిన పామాయిల్ సా గుపై రైతులకు అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ప్రీ యూనిక్ ఇం డియా ప్రైవేట్ లిమిటెడ్, నాగర్ కర్నూల్ ఏరియా మేనేజర్ రాకేష్ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు పామాయిల్ పంట సాగు చేసుకోవాల ని, పామాయిల్ పంట సాగు పట్ల రైతులు చైతన్యవంతులు కావాలని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ అవగాహన సదస్సులో ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నాగర్‌కర్నూల్ ఏరియా మేనేజర్ రాజేష్ తో పాటు ఏరియా టెక్నికల్ మేనేజర్ పాణికుమార్, ఉప్పునుంతల ఆయిల్ ఫాం క్లస్టర్ ఆఫీసర్ ఎండి. హారీఫ్, మాజీ సింగిల్ విండో ఛైర్మన్, ప్రస్తుతం సింగిల్ విండో డైరెక్టర్ మద్దు నరేందర్‌రెడ్డి, డా. కొత్త చిన్న జంగిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి జగన్మోహన్ రెడ్డి, కొత్త పెద్ద జంగి రెడ్డి, కొరటికల్ చంద్రశేఖర్ రెడ్డి, పెద్దాపూర్ నారయ్య, మొల్గర మదన్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండల ప్రెస్‌క్లబ్ కమిటి ఎన్నిక

**కృష్ణ, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కృష్ణ మండలం పాత్రికేయ బృందం ప్రత్యేక సమావేశంలో భాగంగా గురువారం గంటలకు శ్రీశ్రీ క్షీరలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో కృష్ణ మండల నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా గురు ప్రసాద్ (సాక్షి), జగన్నాథ్ (ఆంధ్రజ్యోతి), మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా అశోక్‌గౌడ్, (ప్రజా సాక్షి), ప్రధాన కార్యదర్శిగా కె. నర్సిములు (సూర్య నేటి దినపత్రిక), ఉపాధ్యక్షులుగా సురేష్ (వార్త), నాగేంద్ర


నూతన కమిటిని ఎన్నుకున్న దృశ్యం

(క్యూ న్యూస్), కోశాధికారి గా చెన్నయ్య గౌడ్ (దిశ), కథలప్ప (జు6 వెలుగు), దేవేంద్రప్ప (నవ తెలంగాణ), శేఖర్ గౌడ్ (మన తెలంగాణా), రాజు (ప్రజా పక్షం), శ్రీనివాస్ (మనం), రాము (నమస్తే తెలంగాణా), సురేష్ గౌడ్ (అక్షర విజేత), మహేందర్ (ప్రజాజ్యోతి), వెంకటేష్ (పయనించే సూర్యుడు), కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు.

## సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే

**బిజినేపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలేఅని జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కమిటీ గౌరవ సలహాదారు అంతటి రాజేందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంతటి రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ బిజినపల్లిలో త్వరలో ఆవిష్కరించ బోతున్న మహాత్మా జ్యోతిరావు పూలే


సమావేశంలో మాట్లాడుతున్న గౌరవ సలహాదారు అంతటి రాజేందర్ గౌడ్

విగ్రహావిష్కరణ చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలన్నారు. వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలు అవకాశాలను అందిపుచ్చుకుని విద్య, ఉద్యోగ, ఆర్థికరంగాలలో మరింతగా ఎదగడమే పూలేకు నిజమైన నివాళులు అని పేర్కొన్నారు. సమాజంలో కుల, లింగవివక్షతకు తావులేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పూలే భావించారన్నారు. అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. మహిళలు చదువుకుంటేనే అసమానతలు తొలగిపోతాయని భావించి మొదట తన భార్య సావిత్రీబాయిని విద్యావంతురాలిని చేసిన గొప్ప ఆచరణ వాది అని కొనియాడారు. సమావేశంలో జ్యోతిరావు పూలే, విగ్ర ఆవిష్కరణ చైతన్య కమిటీ కన్వీనర్, ఊరుకొండ రఘుబాబు, దాసర్ల వెంకటస్వామి, కో కన్వీనర్లు బంగారి పర్వతాలు, భగవంతు గౌడ్, వంగ రామన్ గౌడ్, కత్తె ఈశ్వర్, సత్యశిల సాగర్, చెన్నయ్య, దాసర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించడం అమిత్‌షాకు తగునా..

### పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బి వెంకటన్న గౌడ్



**పెబ్బేరు డిసెంబరు 19 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచమేదావి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారతరత్న, డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సభలో అధికారమదంతో, అవమా నించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని బీసీ పొలిటికల్ చేసి రాష్ట్ర కార్యదర్శి వి వి గౌడ్ డిమాండ్ చేశారు. బా బాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానపరచడం అంటే దేశాన్ని అవమాన పరచడమే అని అన్నారు. భారతదేశానికి దిక్సూచి అయిన అం బేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ఈ దేశ పౌరులందరికీ సమాన ఓటు హక్కు, వ్యక్తి స్వేచ్ఛ, జీవించే హక్కు, కల్పించడం జరిగింది. భారతీయులందరూ సోదర భావంతో మెలుగుతున్న తరుణంలో అమిత్ షా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ తరఫున అమిత్ షా వాక్యాలను ఖండిస్తున్నామని తక్షణమే అమిత్ షా దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలి

### అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 19 ప్రభాతవార్త :** రానున్న బోర్డు పరీక్షలను దృష్టిలో పెట్టుకొని 10వ, ఇంటర్ విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించారు. త్వం లో ఇక్కడ విద్యార్థులకు కోడింగ్ పాఠశాల పేరుతో ఆన్లైన్ ద్వారా పైతాన్ కోడింగ్ క్లాసులు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో వసతులపై ఆరా తీశారు. అనంతరం అదనపు కలెక్టర్ పాఠశాలలోని కిచెన్, వంట సామాగ్రి భద్రపరిచే గదులను తనిఖీ చేశారు. వంట సామాగ్రి స్టాక్‌కు సంబంధించిన రిజిస్టర్ లను చెక్ చేశారు. స్టాక్ వచ్చినప్పుడు మెస్ కమిటీ విద్యార్థులు సంతకం చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ సరస్వతి, తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.


బాలికల పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

### ప్రథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో

## ఒక నెల ఎలక్ట్రీషియన్ ఉచిత శిక్షణ

**గద్వాల, డిసెంబరు 19 ప్రభాతవార్త :** గద్వాల్ జిల్లాలో ప్రథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ 18 నుండి 30 సంవత్సరముల వయసు గల యువతి యువకులకు 30 రోజుల్లో ఉచితంగా ఎలక్ట్రిషన్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డాక్టర్ యం. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.సి, ఇంటర్, డిగ్రీ, ఎలక్ట్రిషన్ (ఐటిఐ ఎలక్ట్రీషియన్/ ఇతరులు) అర్హత కలిగి శిక్షణ పూర్తి చేసిన వారికి ఎన్.ఎస్.డి.సి సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని, ఇతర వివరములకు 6303430789, 9030421360 ఫోన్ నెంబర్లను సంప్రదించవలసిందిగా ఆమె కోరారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**గద్వాల, డిసెంబరు 19 ప్రభాతవార్త :** క్రీడలు మన శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్యాన్ని మెరుగుపరచి, సమాజంలో సానుకూల మార్పులను సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం నందు జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సీఎం కప్ 2024 క్రీడా పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మన శారీరక, మానసిక ఆరోగ్యం పెంచడమే కాకుండా, సమాజంలో మానవతా విలువలు, ఆత్మరక్షణ, సహకార భావనలను పెంపొందిస్తాయన్నారు. గద్వాల జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో గొప్ప ప్రదర్శన కనబరచాలన్నారు. క్రీడలు కేవలం శారీరక శక్తినే కాక, క్రమశిక్షణ, అంకితభావం, ధైర్యం పెంచుతాయన్నారు. మహిళల ఆత్మరక్షణ భద్రత కోసం క్రీడలు ఎంతో ముఖ్యమైనవి, మహిళలకు ఆత్మవిశ్వాసం ఇచ్చి, సమాజంలో వారి స్థానాన్ని పెంచుతాయని



సిఎం కప్ క్రీడా పోటీలలో మట్లాడుతున్న అదనపు కలెక్టర్

తెలిపారు. టైక్వాండో, కరాటే వంటి క్రీడలు సమాజంలో ఆత్మవిశ్వాసం, రక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తాయి, ముఖ్యంగా మహిళలకు అవి చాలా ఉపయోగకరమని అన్నారు. భవిష్యత్తులో మంచి వ్యక్తులుగా ఎదిగి, సమాజానికి ఉపయోగకరమైన ఆఫీసర్లు,


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్‌లక్ష్మి నారాయణ, డీఎస్ఓ ఆనంద్

ఉపాధ్యాయులు, క్రీడాకారులు అవ్వాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం 100 మీటర్ల పరుగెత్తే పోటీని బాయ్స్, గర్ల్స్ వేరువేరుగా ప్రారంభించి, హ్యాండ్ బాల్ ఆటను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాల అధికారి బి.ఎస్ ఆనంద్, పి.ఈ.టి లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమిత్‌షా వ్యాఖ్యలపై భగ్గుమన్న దళిత సంఘాలు

### అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన

**అమరచింత డిసెంబరు 19 ప్రభాతవార్త :** రాజ్యాంగం పై పార్లమెంటులో జరిగిన చర్చలో హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమానించారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. గురువారం అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దళిత హక్కుల పోరాట సమితి, దళితసంఘం, మాలమహానాడు నాయకులు మషప్ప, రవీందర్, భాస్కర్ ,అబ్రహం మాట్లాడుతూ లోక్ సభలో అమిత్‌షా కాంగ్రెస్ నాయకును ఉద్దేశించి రోజు అంబేద్కర్ జపం చేసే కంటే భగవంతున్ని స్మరిస్తే కొన్ని జన్మల వరకు స్వర్గ ప్రాప్తి వస్తుందని అనడం అంబేద్కర్‌ను అవమానించడమే అని అన్నారు. భారతదేశానికి


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘం నాయకులు

గొప్ప రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌ను పార్లమెంటులో భగవంతుని కంటే తక్కువ చేసి చూపించడం తగదన్నా రు. ప్రతి ఒక్కరూ ఎవరికితోచిన విధంగా భగవంతుని ప్రార్థించుకోవచ్చని అలాగని ఈ విషయంలో అంబేద్కర్ పేరును ప్రస్తావించడం సరికాదన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుండి కాక బిజెపి నుండి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశంలో బడుగు, బలహీన, వెనుకబడ్డ ముస్లిం, మైనారిటీలకు ప్రతిపౌరునికి రాజ్యాంగ ఫలాలు అందించిన ఘనత అంబేద్కర్ కు ఉందన్నారు. బిజెపి నాయకులు దేశంలో ఏదో ఒకచోట అంబేద్కర్ పై విషయం కక్కుతూ ఉన్నారని ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. వెంటనే అమిత్‌షా తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేటు పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎర్రన్న, శ్యాంసుందర్, సౌలు, దినకర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల కేటాయిపులో అధికారులు ఆలోచించాలి

**గద్వాల, డిసెంబరు19 ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాలంటే గద్వాల అధికారులు తమ జాగీరు అనుకుంటున్నారని ఇష్టా రీతిలో, ఇష్టం ఉన్నోళ్లకు పంచుతున్నారని సినియర్ న్యాయవాది వెంకరాద్రి రెడ్డి గురువారం న్యాయవాదుల దీక్షా శిబిరంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పద్ధతి లేకుండా ప్రభుత్వ భూముల కేటాయింపు జరిగిపోతుందన్నారు. సాక్షాత్తు తెలంగాణ రాష్ట్ర సచివాలయాన్ని 27.9 ఎకరాల్లో నిర్మిస్తే గద్వాల కలెక్టర్ కార్యాలయం కోసం రెవెన్యూ శాఖ 20 ఎకరాలు, ఎస్పీ కార్యాలయంకోసం పోలీస్‌శాఖ 26ఎకరాలు తీసుకుందన్నారు. 59ఎకరాలతో ఉన్న పిజెపికాలనీలో ఇష్టానుసారంగా కట్టడాలు నిర్మించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఇలా జరగలేదన్నారు. ఎక్కడ లేనివిధంగా గద్వాల కలెక్టర్ కార్యాలయంలోఆడిటోరియం నిర్మిస్తామని చెబుతున్నారన్నారు. ఇప్పటికే ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ పక్కన ఆడిటోరియం ఉన్నదన్నారు. పోలీస్ వారి గృహాలకోసం రెవెన్యూ కాలనీ వద్ద పది, పన్నెండు ఎకరాలు ఇచ్చారు. వాటిని వినియోగించుకోవాల్సిందిపోయి తిరిగి ఆడిటోరియం కట్టిస్తాం, పోలీస్ క్వార్టర్స్ నిర్మిస్తామని చెబుతున్నారున్నారు. అధికారుల ఆలోచనలకు అడ్డుకట్ట వేయాల్సిందే అన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సినియర్ న్యాయవాది

# హోమ్ మంత్రి అమిత్ షాను తక్షణమే భర్తరఫ్ చేయాలి

**ధన్వాడ డిసెంబరు 19 ప్రభాతవార్త:** అమిత్ షా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నల్ల బ్యాడ్జీ లు ధరించి నిరసన తెలుపుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ జోలికి వస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. గురువారం బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమాన పరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ను తక్షణమే మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర అమిత్ శా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీఎస్పీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాయ్ అమ్మే వ్యక్తిని కూడా ప్రధానమంత్రిగా చేసిన ఘనత బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఉన్నదని గుర్తు చేశారు. దేశంలోని బహుజన కులాలకు అంబేద్కరే అసలైన దేవుడన్నారు. అంబేద్కర్‌ను అవమాన పర్చడం అంటే దేశంలోని నూట నలభై కోట్ల మంది ప్రజలను అవమానపరచడమే అన్నారు. బాబా సాహెబ్ రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కుట్ర పన్నుతున్నదని అది పార్లమెంటు సాక్షిగా బయటపడిందన్నారు. అంబేద్కర్ భిక్షతో అమిత్‌షా హోమ్ మంత్రి అయ్యాడని ఈ విషయం అమిత్‌షా గుర్తు పెట్టుకోవాలన్నారు. బాబా సాహెబ్ జోలికి వస్తే ఖబర్ధార్ అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వెంటనే దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పి మంత్రి పదవి నుండి తప్పుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇంచార్జీ వెంకటేష్ ముదిరాజ్, బీఎస్పీ మండల అధ్యక్షులు రవి యాదవ్, మండల కో ఆర్డినేటర్ గుర్రం రాజు, మండల కోశాధికారి జడల బాల్‌రాజ్, సోషల్ మీడియా ఇంచార్జీ అశోక్, బీఎస్పీ నాయకులు అరవింద్, కురుమూర్తి, మొగులయ్య, అజయ్ కుమార్, వెంకటేష్, బాను తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

# పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించండి

### అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కేతపాగ సుధాకర్

**చిన్నంబావి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గ్రామాలలో ప్రతి మాసంలో 30వ తేదీ రోజు పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి, కుల, మత సామరస్యతకు పాటుపడాలని చిన్నంబావి మండల నూతన ఎస్సై జగన్మోహన్‌ను మండలం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు కేతపాగ సుధాకర్, పెరుమాళ్ళ శ్రీనివాస్‌లు కోరారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై జగన్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో, అస్పృశ్యత నిర్మూలనకు గ్రామాలలోని దళితవాడల్లో సహపంక్తి భోజనాలు, నిర్వహించాలని ప్రతిమాసంలో 30తేదీన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సూచించడం జరిగిందని వారన్నారు. చిన్నంబావి మండలంలో గత 18 సంవత్సరాలుగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 59 దళిత ఉపకులాల ఐక్యత, దళితేతర కులాలతో ఐక్యత, స్నేహభావం కోసం కృషి చేస్తున్నామని, ముఖ్యంగా మాల, మాదిగల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తున్నామని వారు అన్నారు. అలాగే ఇతర వర్గాలతో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పడానికి పౌర హక్కుల దినోత్సవాని ఉపయోగించి సమాజానికి పాటుపడాలని వారు కోరారు. ఇట్టి విషయంపై స్పందించిన ఎస్ఐ గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి అన్ని వర్గాలు స్నేహపూర్వకంగా మెలగాలని అందుకు ప్రజల సహకారం, ఉన్నత అధికారులతో మాట్లాడి పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించడానికి తాను సైతం కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు పానుగంటి నరసింహ, బాపనపల్లి సుగ్రీవుడు తదితరులు పాల్గొన్నారు.


ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన అంబేద్కర్ సంఘం నాయకులు

# బహిరంగ చర్చకు మేం సిద్ధం

### - సమయం., ప్లేసు చెప్పండి మేం రెడీ
### - కాంగ్రెస్‌కు భూత్పూర్ బీఆర్ఎస్ ప్రతి సవాల్

**భూత్పూర్, డిసెంబరు 19, ప్రభాతవార్త :** కాంగ్రెస్ నాయకులు బుధవారం భూత్పూర్‌లో మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పాలనపై, మచ్చలేని తమ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై లేనిపోని అవాస్తమైన ఆరోపణలు చేస్తూ బురద జల్లే ప్రయత్నం చేశారని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) భూత్పూర్ మండల అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ప్రధానకార్యదర్శి తూము శ్రీనివాస్‌రెడ్డి గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు దేవరకద్ర నియోజక వర్గానికి బీటీ రోడ్లు ఇప్పుడు మంజూరైనవి కావని, తమ బీఆర్ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హయాంలో మంజూరైనవేనని, వాటికి ప్రస్తుత ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పదేళ్లపాలనలో చేసిన అభివృద్ధి ఏంటో బహరంగ చర్చలో చెబుతామని, బహిరంగ చర్చకు ప్లేసు, డేటు, సమయం చెప్పాలని, ఇందుకు మేం రెడీ అని ప్రతి సవాల్ విసిరారు. మసిబూసి మారేడు కాయ చేసినట్టు కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలతో, అంకెల గారెడి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చెబుతూ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కంటే ముందు యాభై ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉండి తెలంగాణ జిల్లాలకు చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు. తమ పాలనలో మంజూరైన పథకాలు కాకుండా కొత్త పథకాలు తెచ్చి అప్పుడు మాట్లాడాలని వారు హితవు చెప్పారు. అపార అనుభవమున్న తమ నాయకుడిపై కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు బురద జల్లే యత్నాన్ని మానుకోవాలని సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. రైతుల రుణమాఫీ, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, దళితబంధు, రైతు బంధు తమ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టినవేనన్న అంశాన్ని కాంగ్రెస్ నాయకులు మననం చేసుకోవాలని సూచించారు. ఇకనైన బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకులు విమర్శలు మాని మీ ప్రభుత్వం చేపడుతున్న కొత్త పథకాలేంటో చెప్పాలని. పాతపథకాల గురించి ప్రస్తావించకూడదని హితవు చెప్పారు. సిద్ధాంత పరమైన విమర్శలు చేస్తే స్వీకరిస్తా మని, వ్యక్తిగత విషయాలు, నాయకులపై బురద జల్లే ప్రయత్నాలు కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ విసిరిన సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని, బహిరంగ చర్చ ఎప్పుడో చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ భూత్పూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డిలు డిమాండ్ చేశారు.

## మాలలు ముందస్తు అరెస్ట్



**అమరచింత డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ మాల మహానాడు చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న మాల మహానాడు నాయకులను గురువారం ఎస్సై సురేష్ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్ వేద విష్ణు మాట్లాడుతూ, శాంతియుతంగా అసెంబ్లీకి వెళుతున్న మాల మహానాడు నాయకులను అరెస్టు చేయడం తగదని అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ బిల్లును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామస్వామి రామ్మూర్తి అరెస్టు అయిన వారిలో ఉన్నారు. అమరచింత పోలీస్ స్టేషన్లో మాలమహానాడు నాయకులు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు రామకృష్ణ

**పాన్‌గల్ డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఈనెల 22న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రం నా లుగవ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ తోపాటు రాష్ట్ర నాయకు లు పాల్గొనడం ఉన్నారని ఆయన తెలిపారు. విద్యుత్ ఉద్యోగు ల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ ముందుంటా మని ఆయన తెలిపారు. ప్రతి విద్యుత్ ఉద్యోగి, విశాఖ మహా సభలకు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## తనయుడ్ని కోల్పోవడం బాధాకరం

### మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

**రాజాపూర్ డిసెంబరు 19 ప్రభువార్త :** మండల కేంద్రానికి చెందిన మీసేవ నిర్వాహకుడు సున్నపు రాధాకృష్ణ తనయుడు సుభాష్ మృతి బాధాకరమని వైస్‌ఎంపీపీ మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాధాకృష్ణ ఇంటికి చేరుకొని కుటుంబాన్ని పరామర్శించి సుభాష్ మృతి బాధాకరమని తనయుడు లేని లోటు పూడ్చలేనిదని అయినా గుండె ధైర్యంతో బ్రతకాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యంతో ఉండాలని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్లలో నిరుపేదలకు ప్రాధాన్యత

### మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్



**రాజాపూర్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతుంది. గురువారం కానాపూర్ గ్రామంలో ఇంద్రమ్మ ఇండ్ల సర్వేకు వచ్చిన అధికారులతో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్ పాల్గొని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మార్కెట్ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని ఎవరు కూడా అధర్యపడవద్దని లబ్ధిదారులందరికీ ఖచ్చితంగా ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని గ్రామస్తులకు తెలియజేశారు.

## సేంద్రీయ పంటలు ఆరోగ్యానికి మేలు

◆మండల విద్యాశాఖ అధికారి సుధాకర్


బడి తోటలో పండించిన కూరగాయలు

**రాజాపూర్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలోని కల్లేపల్లి యుపిఎస్ పాఠశాలలో బడి తోటలో పండిన కూరగాయలను గురువారం మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో పండించిన బడి తోటలో కూరగాయలు టమాటాలు, వంకాయలు, పచ్చిమిర్చి, బీరకాయలు, కొత్తిమీర తదితర కూరగాయలను కొంత మంది ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సేంద్రియ పద్ధతి లో పండించే కూరగాయలతో పాటు వివిధ రకాల పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని విద్యార్థులు తమ తమ పంట పొలాలలో తల్లిదండ్రుల తోటి సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తే అవి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని సేంద్రియ పద్ధతిలోనే పంటలు పండించేందుకు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుధాకర్‌తో పాటు జడ్.పి.హెచ్.ఎస్ రంగారెడ్డిగూడ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో జిల్లాలో ఎన్నికలకు కార్యాచరణ ప్రణాళిక

◆ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న బచ్చు రామకృష్ణ

**కల్వకుర్తి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాలలో ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ఎన్నికలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ ప్రకటించారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో ఆర్యవైశ్య ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు నెలల్లో జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల ఆర్యవైశ్య సంఘాల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు ప్రకటించారు. అన్ని ఎన్నికలు పూర్తి అయిన వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లాఆర్యవైశ్య మహాసభ కార్యవర్గాన్ని ఎంపిక చేసే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లాలోని ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఎన్నికలకు సహకరించి నూతన కమిటీల ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసే విధంగా ముందుకు రావాలని బచ్చు రామకృష్ణ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి మేఘన్న అభయ హస్తం


మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

**గోపాల్‌పేట డిసెంబరు 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలికే పహాడ్ గ్రామానికి చెందిన ఆదిరాల వెంకటయ్య (40) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఉమ్మడి గోపాల్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందా సత్యశీలారెడ్డి స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి దృష్టికి తీసుకుపోగా, ఆయన మానవతా దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటస్వామి, యూత్ అధ్యక్షుడు కర్నాకర్, ఉపాధ్యక్షుడు చరణ్ కుమార్, బర్గం రాములు, కృష్ణయ్య, పర్వతాలు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మృతుని కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో ఉత్తమ 108 ఉద్యోగి అవార్డు


అవార్డు అందుకుంటున్న 108 ఉద్యోగి

**నారాయణపేట టౌన్, డిసెంబరు19 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం పేరపళ్ళ గ్రామా నికి చెందిన రాజ్ కుమార్ 108 అంబులెన్స్‌లో గత పది సంవత్సరాలు నుంచి ఎమర్జెన్సీ మెడి కల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన విధి నిర్వహణలో భాగంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, తెలంగాణ రాష్ట్రం నుంచి నియోనేటల్ అంబులెన్స్‌లో నవజాత శిశువును రక్షించినందుకు జాతీయస్థాయిలో ఉత్తమ108 ఉద్యోగి అవార్డును జీవీకే ఈఎంఆర్ఐ ఫౌండర్ చైర్మన్ జీవీ కృష్ణారెడ్డి తెలంగాణ రాష్ట్ర108 స్టేట్ హెడ్ ఖలీదు చేతుల మీదుగా గురువారం హైదరాబాదులో అందుకోవడం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగి అవార్డు మన నారాయణపేట జిల్లాకు రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ అధికారి రవికుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉత్తమ ఉద్యోగి అవార్డు పొందిన రాజ్ కుమార్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు అభినందించారు.

## పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో అన్ని మండలాలలో చేపట్టిన మన ఊరు-మనబడి పెండింగ్ బిల్లులు తక్షణమే వెంటనే చెల్లించాలని ఎంపీపీ సత్తవరం నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఎంపీపీ సత్తవరం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ బాదా వత్ సంతోష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలకు సంబంధించిన గ్రామాలలో మన ఊరు-మనబడి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నూతన పాఠశాల భవనాలు నిర్మించడం, పాత పాఠశాల భవనాలకు గదులు, తలుపులు, కిటికీలు, టాయిలెట్స్ రిపేర్లు, విద్యుత్ పనులులాంటి పనులను సొంత డబ్బులతో చేపట్టడం జరిగిందన్నారు. పనులు నిర్వహించి సంవత్సరాలు గడిచిందని, సంబంధిత పనుల బిల్లులు రికార్డు చేసి పంపించిన ఇంతవరకు మాకు బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పనులు పూర్తి చేసిన పాఠశాల భవనాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్న మాకుడబ్బులు రాకపోవడంతో అప్పులపాలై ఇబ్బందులకు గురవుతు న్నామన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే గ్రామాలలో అభివృద్ధి కోసం చేసిన వివిధ పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిపోయిన బిల్లులు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము తాము చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, లేనియెడల పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని ఎంపీపీ నరసింహారెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు.

## నారాయణపేట జిల్లా టీజీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



**నారాయణపేట టౌన్, డిసెంబరు19 ప్రభాతవార్త:** తెలంగాణతహశీల్దార్ అసోసియేషన్(టిజిటిఏ) నారాయణపేటజిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నారాయణపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, రాష్ట్ర సెక్రటరీ రమేష్ ఆధ్వర్యంలో జరిగినది. కార్యక్రమానికి అతిథిగా బిక్షం సెక్రటరీ టిజిఆర్ఎస్ఏ హాజరైయ్యారు. సమావేశంలో టిజిఆర్ఎస్ఎ ఆవిర్భావం ఆవశ్యకత, గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం గురించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ తీర్మానించనైనది. సమావేశంలో నూతన రెవెన్యూ చట్టం గురించి, అన్నిక్యాడర్లలో ఉన్నఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన విషయంలో ఎలక్షన్ బదిలీ విషయంలో సుదీర్ఘంగా చర్చించి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, రామకృష్ణ, డిసిఏ రాములు టిజిటిఏ అధ్యక్షులు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం నారాయణపేట జిల్లా నూతన టి జి ఆర్ ఎస్ ఏ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గం చింతరవి అధ్యక్షులు, ఎం .శ్రీకాంత్ జనరల్ సెక్రటరీ, ఉపాధ్యక్షులు రామకృష్ణ, హాజీరా బీబీ, విష్ణు, జాయింట్ సెక్రటరీ కిరణ్, రామాంజనేయులు, చైతన్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేంద్రప్రసాద్ ట్రెజరర్ అజహర్ ఖాన్, పబ్లిసిటీ కల్చరల్ సెక్రటరీ జగన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కాలప్ప, అమర్నాథ్, భూపాల్‌రెడ్డి, ఆశా బీ, మల్లప్ప, శ్రీనివాస్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం టిజిటిఏ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంటుగా ఎండీ జామిల్ జాయింట్ సెక్రెటరీగా దయాకర్‌రెడ్డి, ట్రెజరర్ మల్లికార్జునరావ్ మెంబర్లుగా మల్లారెడ్డి, సింధూజ, అనిల్ కుమార్, భాస్కర్ జయరాములు, సతీష్, తహసీల్దార్‌లు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టి..

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలి

◆ బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ


మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**నారాయణపేట టౌన్, డిసెంబర్19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వం పాలకులు మారారు కానీ పాలన మారలేదని ఈ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం పని చేయాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం నారాయణ పేటలో జిల్లా బిజెపి అధ్యక్షుడు పి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన జిల్లా పార్టీ ముఖ్య ప్రతినిధులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల గారడితో 6 అబద్ధాలు 66 మోసాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు రుణమాఫీ లేదు, ఏడాది అయినా రైతు భరోసా లేదని, మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు. అలాగే గృహజ్యోతితో మహిళలను మోసం చేశారని, వృద్ధులకు చేయూత అందించలేదని, యువత వికాసం మరిచారని సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పడ్డారనీ అన్నారు. అలాగే ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారని ప్రజలు వీరి పాలనలో భూమి, ఇళ్లు కోల్పోయారని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేశారని ఆడబిడ్డలు ఆక్రందనలు చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రనాయకులు బి.కొండయ్య, నాయకులు బంటు రమేష్, బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి జి.కే.నర్సింహులు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అయిల్ ఫామ్ సాగు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం

తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి


మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**నారాయణపేట టౌన్, డిసెంబరు19 ప్రభాతవార్త:** రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ జంగా రాఘవ రెడ్డితో పాటు ట్రైని కలెక్టర్ గరిమ నరుల, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ హార్టికల్చర్ సైంటిస్ట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ఆయిల్ ఫామ్ సాగు పెంచడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరికి బదులు ఆయిల్ ఫామ్ సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా నిలవకు కోవచ్చు అని తెలిపారు. రైతులకు ఉచితంగా మొక్కలు అందజేసి సాగుకు అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు అవగాహన పెంచుకొని ఆయిల్ ఫామ్ సాగు చేయడం ద్వారా మన ప్రాంతంలో పామాయిల్‌తయారు చేసే యూనిట్లను కూడా నెలకొల్ప వచ్చున్నారు. రైతు విద్యాసాగర్ మాట్లాడుతూ ఒకటిన్నర ఎకరాలలో మొక్కలు వేశామని తెలిపారు. మరో రైతు మాట్లాడుతూ ఖమ్మం రైతును ఇక్కడకు వచ్చి మొక్కలు తీసుకుపోతున్నారని తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పది ఎకరాలు ఆయిల్ పాము సాగు చేసే రైతుకు వారానికి పాతికవేల ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి సురేష్, జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ మేనేజర్ జె.సత్యనారాయణ, జిల్లా అధికారి చంద్రశేఖర్, ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంచార్జి అధికారి సమీనా హాజరయ్యారు.

# వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన


వడ్ల కొనుగోలు కేంద్రంలో నిరసన తెలుపుతున్న రైతులు

**పెబ్బేరు డిసెంబరు 19 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో కిష్టారెడ్డిపేట వడ్ల కొనుగోలు కేంద్రంలో ఐకెపి మోప్మా ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఆరుగలం శ్రమించి పండించే రైతులకు తిప్పలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లను కొనుగోలు చేస్తున్న రైతులకు తరుగులు తీస్తూ నిర్వాహకులు రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు. కొనుగోలు కేంద్రంలో మొప్మా సిబ్బంది అయినా ఒక బుక్‌కీపర్ చేతివాటం చూపుతున్నారని రైతులు, తోటి బుక్కీ ఫర్ ఆరోపిస్తున్నారు. రైతుల మధ్య దానం సేకరించి ఆరు సార్లుగా మిల్లులకు చేరవేయగా కేంద్రంలో చేసిన తూకం కంటే దాదాపు 13 క్వింటాళ్ల ధాన్యం తరుగుపోయిందని రైతులు వెల్లడించారు. రెండు రోజులుగా నరేష్ సహాయంతో కాకుండా తోటి బుక్ కీపర్ నాగరాణి తోటి సిబ్బంది రెండుసార్లు వేరే మిల్లులకు లోడ్ పంపగా ఏమాత్రం తరుగు రాలేదు. దీంతో నరేష్ పై అందరూ అనుమానం వ్యక్తం చేస్తున్న ఈ విషయాన్ని తెలుసుకున్న రైతులు గురువారం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేశారు. బుక్ కీపర్ నరేష్‌తో వాగ్వాదానికి దిగగా అతడు అక్కడి నుండి మెల్లగా జారుకున్నాడు. ఇక రైతులు మరో వాదన ఏమిటంటే తూకాలు వేసేటప్పుడు ఏ రైతుధాన్యం ఎంత తూకం వచ్చింది ఎన్ని సంచులు వచ్చాయి అనేది కూడా సమాచారం ఇవ్వడం లేదని దొడ్డు వడ్లు కొనుగోలు చేయడం లేదని సన్ అవుట్ లో మాత్రమే తీసుకుంటున్నారని రైతులు ఆరోపించారు. గుడ్లకాంత చేసినాక తొందరగా అప్లోడ్ చేయకుండా పైసలు వేసే క్రమంలో కూడా జట్టడం జరుగుతుందని రైతులు ఆరోపించారు.

# సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


మాట్లాడుతున్న ఎస్‌టియుటిఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీధర్ రావు

**ఉప్పునుంతల, డిసెంబరు19 ప్రభాతవార్త:** పాఠశాల విద్యాశాఖలో భాగంగా తెలంగాణ సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ)లో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగ, ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, టైం స్కేల్ ఇవ్వాలని న్యాయమైన వారి డిమాండ్ల సాధన కోసం స్టేట్ టీచర్స్ యూనియన్ ఎస్ టి యు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంఘం మురళి, కొత్త శ్రీధర్‌రావు తెలియజేశారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి వారుమాట్లాడుతూ గత రెండు వారాలుగా సమ్మెలో ఉన్న 400కు పైగా కెజీబీవీ, ఎస్ఓలు, సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, స్కావెంజర్స్, వాచ్ మెన్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ మొదలైన ఒప్పంద ఉద్యోగస్తుల క్రమబద్ధీకరించి వారికి మినిమం టైమ్స్ స్కేల్ ఇవ్వాలని, సమానపనికి తగిన సమాన వేతనం అమలుచేయాలని, మహిళాఉద్యోగస్తులకు రెగ్యులర్ ఉద్యోగస్తుల లాగా ప్రసూతి సెలవులు180 రోజులుఇవ్వాలని, అసెంబ్లీ సమావేశాలలోగా వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు కొవ్వొత్తులతో నిరసన


కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

**గద్వాల డిసెంబరు 19 ప్రభాతవార్త:** సమ్మెలో వినూత్న కార్యక్రమంలో భాగంగా 10వ రోజు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ర్యాలీ, మాన వహారం, డాక్టర్ అంబేద్కర్ కి వినతి పత్రం ఇస్తూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్స్ నెరవేరాలని ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టా రు. గురువారం వివిధ రూపాల్లో నిరసన తెలుపుతూ రాజీవ్ మార్గ్, స్మృతి వనం, నుండి పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ నిరసన తెలిపారు. రిటైర్డ్ ఎంఈఓ బసవరాజ్ మాట్లాడుతూ ఈ ఉద్యమం విజయవంతం కావాలని ఆశిస్తున్నాను అన్నారు. విద్యాశాఖలో నిర్లక్ష్యం తగదని, విద్యా రంగం అభివృద్ధి చెందితేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతా యన్నారు. కావున కంపల్సరీ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్స్ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని సమ్మెకు మద్దతు తెలిపి పాల్గొన్నారు. వెంకటస్వామి మాట్లాడుతూ వెట్టి చాకిరి చేయడం తప్ప ఏ ప్రయోజనం కలగలేదన్నారు. ఐజ మండల తరఫున మా యొక్క మద్దతు ఉంటుంది అని సమ్మెకు మద్దతు తెలిపారు. శర్మ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల 9వ రోజు మా ఐజ మండల ఎంఈఓ, మా ఉపాధ్యాయులందరూ మద్దతు ఇస్తున్నామని, మీ పోరాటము కొనసాగించాలని, తప్పక విజయం సాధిస్తారు అన్నారు. తప్పక మీ డిమాండ్స్ నెరవేరుతాయి అని సమ్మెకు మద్దతు తెలిపారు. ఐజ ఎం ఈఓ రాము మాట్లాడుతూ ఉద్యమాల గడ్డ మన నడిగడ్డని, ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు బలిదానాలు, అయితే తప్ప మన రాష్ట్రం సిద్ధించలేదన్నారు. వెట్టిచాకిరి చేస్తున్న మీ త్యాగాలు వృధా కారాదని, మీ పోరాటం వృధా కారాదని పాలకులు మనల్ని విడగొట్టి పాలించడంలో సిద్ధహస్తులు అన్నారు. రాజకీయ నాయకులు హామీలు నెరవేర్చడం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని కేజీబీవీల నుండి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, యూఆర్ఎస్, స్పెషల్ ఆఫీసర్ శేషన్న, సి.ఆర్.టి.లు. పీజీసీ ఆర్టీలు, నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా ఈ సమ్మెలో పాల్గొనడం జరిగింది. డీపీఓ వింగ్ అధ్యక్షుడు డిఎల్ఎంటి బి రామాంజనేయులు, మిస్ వింగ్ అధ్యక్షుడు శ్రీధర్, సీసీఓ వింగు అధ్యక్షుడు ఆల్తాఫ్, సీఆర్పీ వింగ్ అధ్యక్షుడు ఎంఎ సమీ, ఐఈఆర్ పి వింగ్ అధ్యక్షుడు మురళి, పిటిఐ వింగ్అధ్యక్షుడురాజేందర్ రోజువారిగవీరు పాల్గొన్నారు. అదే విధంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఉషనప్ప, జేఏసీ ప్రధాన కార్యదర్శి గోపాల్, మల్దకల్ డీఈఓ విజయ్, సమగ్ర శిక్ష లోని అన్ని వింగుల అధ్యక్షులు పాల్గొని బుధవారం నిరవధిక సమ్మెను విజయవంతం చేశారు.

# ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన నిందితుడికి జైలు శిక్ష

**మక్తల్ టౌన్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన నిందితునికి గురువారం నాడు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ 10సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష తో పాటు రూ. 55 వేల జరిమానా విధించడం జరిగిందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వివరాల ప్రకారం మక్తల్ పట్టణానికి చెందిన యువతి, ఈడిగ రాజేష్ గౌడ్ తండ్రి చంద్రశేఖర్‌గౌడ్ (26) మక్తల్ అంబేద్కర్ నగర్ కాలనీ కి చెందిన వ్యక్తి నన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ అద్దె భవనంలో ఉంటూ సహజీవనం చేస్తూ ఉండే వారని కొన్ని రోజుల తర్వాత రాజేష్‌గౌడ్ వారి ఇంట్లో పెద్ద వారు ఒప్పుకోవడం లేదని అవాయిడ్ చేస్తూ ఉండి తరుచుగా నన్ను నానా బూతు మాటలు తిడుతూ వేధించి నాడు పెళ్లి చేసుకుంటానని చెప్పి నన్ను శారీరకంగా అనుభవించిన రాజేష్ గౌడ్ పై చట్టరీత్య చర్య తీసుకోవాలని తేది:28.08.2021నాడు మక్తల్ పోలీస్ స్టేషన్లో ఆ యువతి ఫిర్యాదు ఇవ్వగా అప్పటి మక్తల్ ఎస్సై రాములు కేసు నమోదు చేయగా అప్పటి మక్తల్ సీఐ శంకర్ కేసు ఇన్వెస్టిగేషన్ చేసి చార్జిషీట్ కోర్టులో నమోదు చేశారు. ప్రస్తుత సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డిల ఆదేశాల మేరకు కోర్టు డ్యూటీ ఆఫీసర్లు కబీర్, బీమ్ రాజ్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కృష్ణయ్యగౌడ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప గారు కోర్టులో వాదనలు వినిపించగా నిందితునిపై నేరం నిరూపన అయినందున జిల్లా జడ్జిగారు తీర్పును వెలువరించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీ అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో మహిళలను, అమ్మాయిలను వేధించిన, నేరాలకు పాల్పడిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.

## ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**లింగాల, డిసెంబరు19 ప్రభాతవార్త:** లింగాల మండల కేంద్రంలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీ మండలధ్యక్షులు డి.నర్సింహ, జెడ్పిహెచ్ఎస్ లింగాల, ప్రధానకార్యదర్శి కె.బాలు అజయ్ కొత్తకుంటపల్లి ఉపాధ్యాయులు, ఉపాధ్యక్షురాలు కవితారాణి, జెడ్పిహెచ్ఎస్‌లింగాల, ఉపాధ్యక్షులు మల్లిఖార్జున్ అంబట్‌పల్లి, కోశాధికారి జె.సురేష్ లింగాల, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ శివ కుమార్, అదేవిధంగా జడ్పిహెచ్ఎస్ లింగాల కాంప్లెక్స్ కన్వీనర్ జులేఖ బేగం, కో కన్వీనర్ సుజాత, జెడ్ పిహెచ్ఎస్ అంబట్ పల్లి కాంప్లెక్స్ కన్వీనర్ అనిల్ కుమార్, కో కన్వీనర్ పావని, ఓటు కన్వీనర్ డి.మహేష్ అప్పాయిపల్లి, మహిళ సబ్ కమిటీ కన్వీనర్ బీమారాణిపద్మనపల్లి, అకాడమిక్ కమిటీ కన్వీనర్ సౌజన్య చెన్నంపల్లి, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ వి.రాధిక కస్తూర్బా గాంధీ విద్యాలయం, సోషల్ మీడియా కన్వీనర్ ఆర్ రాజా, క్రీడా కమిటీ కన్వీనర్ వసంత్ యాదవ్, జెడ్పిహెచ్ఎస్ లింగాల, కార్యదర్శులు అజయ్ మాడాపూర్, ధరమ్‌సింగ్ లింగాల, శారద కస్తూర్బా గాంధీ విద్యాలయం, వెంకటయ్య ఎర్రపెంట ఉపాధ్యాయులను కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**వెల్దండ, డిసెంబరు 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పేద మధ్య తరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి మెరుగైన వైద్యానికి ఎంతో దోహదపడుతుందని వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన ఆర్ల వెంకటమ్మకు రూ.24 వేలు, తోట లక్ష్మికి రూ.14వేలు, పెద్ది యాదమ్మకు రూ.12వేల రూపాయలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కంటోనిపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణతో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## జీతాల చెల్లింపు జాప్యంపై తపస్ నిరసన

**నారాయణపేట టౌన్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** డీఎస్సీ 2024 ద్వారా ఎంపిక ఉపాధ్యాయుల వేతనాలు చెల్లింపులు తీవ్ర జాప్యానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ట్రెజరీ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ మాట్లాడుతూ ఇంతటి జాప్యం గతంలో ఎప్పుడూ చూడలేదని ఉద్యోగం వచ్చిన తృప్తిని ఉపాధ్యాయులు పొందలేకపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా అక్టోబర్ 10 నుండి జీతాలు చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వేగవంతంగా నిర్ణయాలు తీసుకొని జీతాల చెల్లింపుకు తగు చర్యలు వేగంగా తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త నర్సింగప్ప, నారాయణపేట ఉట్కూర్ దామరగిద్ద అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, చిన్న నరసింహులు, రాములు, భాస్కర్, లాలప్ప, అశోక్, నూతన ఉపాధ్యాయులు రామేశ్వర్, సురేందర్, శివరాజ్, బాలు, ప్రియాంక, బీరప్ప, అనిత, ఐశ్వర్య, రాకేష్, ప్రదీప్, మొనప్ప, వాజ్‌పాయ్, శంకర్‌సింగ్ పాల్గొన్నారు.

## నూతన ఎస్సైకి సన్మానం

**కొత్తకోట డిసెంబర్19 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణ కేంద్రానికి కొత్తగా వచ్చిన ఎస్సై ఆనంద్‌ను ఎన్ఎస్‌యుఐ దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జ్ ముస్తఫా ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా శాలువాతో సన్మానించారు. ఇది వరకు ఇక్కడ పని చేసిన ఎస్సై మంజునాథ్ రెడ్డి బదిలీపై వెళ్లడంతో అయన స్థానంలో కొత్తగా ఆనంద్ రావడం జరిగింది. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షాను మంత్రి పదవి నుండి తొలగించాలి

**కొత్తకోట డిసెంబరు 19 ప్రభాతవార్త:** పార్లమెంట్ చట్టసభ సమావేశాలలో ప్రపంచ మేధావి బడుగు బలహీన వర్గాలకు ఓటు హక్కు కల్పించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రిని క్యాబినెట్ నుంచి తొలగించి బర్తరఫ్ చేయాలనీ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కొత్తకోట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ, ఆయా దళిత, బహుజన, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని నీళ్లతో శుభ్రపరిచి పాలాభిషేకం చేశారు. అమితాషాను వెంటనే క్షమాపణ చెప్పకపోతే అన్ని పార్టీలు, సంఘాలను కలుపుకొని నిరసనలు చెప్పడతామని హెచ్చరించారు. అదేవిధంగా అమితాషా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ దళిత సంఘాల నాయకులు కొత్తకోట లోర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బహుజన, దళిత, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీసంతాన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**గద్వాల డిసెంబరు 19 ప్రభాతవార్త:** శ్రీ సంతాన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్స వాలు ఈ నెల 21 శనివారం నుండి ప్రారంభం అవుతున్నాయి. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక దేవాలయ ధర్మకర్తలు విక్రమ్ సింహారెడ్డి సుహాసిని రెడ్డి సంయుక్తమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మకర్తలో మాట్లాడుతూ శ్రీ సంతాన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్స వాలు 21 వ తేదీ శనివారం ప్రారంభమవుతాయి ముందు రోజు పుణ్యాహవాచనము అంకురారోహణము ధ్వజారోహణము బేరిపూజ హోమముసాయంత్రం కళ్యాణోత్స వం జరగనున్నవి. ఆదివారము 22వ తేదీ నిత్యహోమము సాయంత్రం స్వామి వారి పల్లకి సేవ ఊరేగింపు ఊంజల్ సేవ ప్రసాద వితరణ రథోత్స వం జరుగుతాయి 23 సోమవారం పారువేట తీర్థావళి నాగవల్లి పూర్ణాహుతి దేవతావిసర్జన బ్రహ్మోత్స వాలు పూర్తవుతాయి కావున భక్తదులందరూ విచ్చేసి స్వామివారి యొక్క తీర్థప్రసాదాలు స్వీకరించి బ్రహ్మోత్స వాలు కనులారా చూసి తరించగలరని పత్రికాముఖంగా భక్తులను కోరినారు. ఈ కార్యక్రమంలోప్రధాన అర్చకులు సంపూత్ భరద్వాజ్ ఎస్‌వీఎస్ సేవా సంఘం నిర్వాకుడు అభిలాష్ శ్రీకాంత్, బోరవెల్లి పవన్ కుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, భాస్కర్, కొత్త వెంకటేష్ ,సతీష్ దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చలో అసెంబ్లీని అడ్డుకున్న పోలీసులు

**చిన్నంబావి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఏబిసిడి వర్గీకరణ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేయడం కాంగ్రెస్ పార్టీకి పనిచేసిన మాలలను అణిచివేయాలని చూస్తున్నారని, ఇది మాలల వ్యతిరేక ప్రభుత్వంగా రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని దానికి నిరసనగా గురువారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునివ్వడంతో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన చిన్నంబావి మండల మాల మహానాడు నాయకలను ముందస్తు అరెస్టు చేసి నిర్బంధించారు. అరెస్ట్ అయిన వారిలో తాలూకా మాల మహానాడు నాయకులు తలారి వెంకటేశ్వర్లు, బాపనపల్లి సుగ్రీవుడు, గడ్డం శ్రీనివాసులు ఉన్నారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు నాయకులు కురిటి విజయకుమార్, లెంకపల్లి చెన్నయ్య పాల్గొన్నారు.

## పాఠశాల మరమ్మతులకు రోటరీ క్లబ్ రూ.10 లక్షల విరాళం

**కొల్లాపూర్, డిసెంబరు19 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు మరమ్మత్తులకై రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలు అందజేయడం జరిగింది. మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపుతో నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకై రోటరీ క్లబ్ బృందం పరిశీలన చేశారు. రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ కృషితో పాన్‌గల్ మండల పరిధిలోని మల్లాయిపల్లి గ్రామ పాఠశాలకు రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ శాఖ అధ్యక్షులు విసిరెడ్డి బాలకోటి రెడ్డి నేతృత్వంలో 10 లక్షల రూపాయలను పాఠశాల అభివృద్ధికి కేటాయించడం జరిగింది. దీనితోపాటు పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని గంట్రావుపల్లి మరియు పాన్ గల్ మండల పరిధిలోని కదిరేపాడు, షాగాపూర్,పానగల్ మండల కేంద్రం మల్లాయిపల్లి, వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి పాఠశాలలను సహితం రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ శాఖ అధ్యక్షులు విసిరెడ్డి బాల కోటిరెడ్డి రోటరీ సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజాకృష్ణ, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజల బృందం గురువారం ఆయా గ్రామ నాయకులతో కలిసి పాఠశాలలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు తక్షణం కావాల్సిన మౌలిక వసతులపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అడిగి తెలుసుకోవడంతో పాటు, పాఠశాలల తరగతి గదులను పరిశీలించడం జరిగిందని సాధ్యమైనంత వరకు ఆయా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మంత్రి జూపల్లి దృష్టికి కూడా తీసుకువెళ్లి ప్రభుత్వపరంగా సమస్యలు పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మరియు రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు ఆయా గ్రామాల ప్రస్తుత మరియు మాజీ ప్రజా ప్రతినిధులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీ

**లింగాల, డిసెంబరు 19 ప్రభాతవార్త:** లింగాల మండల కేంద్రంలోని కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీ జరిగిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ఈ విధంగా ఉన్నాయి. కల్వకుర్తి డిపోకు చెందిన ఎపి 22 0137 నెంబర్ గల ఆర్టీసీ బస్సు బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కల్వకుర్తి చేరుకొని అక్కడి నుంచి లింగాలకు వచ్చి రాత్రి సమయంలో లింగాలోనే నైట్ హాల్ట్ అయిందని తెలిపారు. తిరిగి మరుసటి ఉదయం 5 గం.లకు లింగాల నుంచి బయలుదేరుతుందని ఎస్ఐ తెలిపారు. గురువారం ఉదయం డ్రైవర్ 5 గంటల సమయంలో లేచి బస్సు బయలు దేరడానికి ముందు డ్రైవర్ ఒకసారి బస్సు టైర్లు,బస్సు నుచెక్ చేస్తున్న సమయంలో బస్సు నుంచి డీజిల్ వాసన వచ్చినట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ వెంటనే బస్సు డీజిల్ ట్యాంకు చెక్ చేయగా ట్యాంకు మొత్తం ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బస్సులో నుంచి అందాజా 200 లీటర్లు డీజిల్ దొంగతనం చేసి తీసుకెళ్ళారని, బస్సు డ్రైవర్ సుల్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. డ్రైవర్ సుల్తాన్ తో పాటు కండక్టర్ జాఫర్ ఖాన్ కూడా నైట్ హాల్ట్ డ్యూటీలో ఉన్నారని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**చిన్నంబావి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగ బిచుపల్లి యాదవ్ గ్రామంలో అనారోగ్య బాధిత లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సంజీవరెడ్డికి రూ.60 వేలు, బడికల సాయికి రూ.33 వేలు,బంకుమీది రాధమ్మకు రూ. 12వేలు బాధితులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జంగ బిచుపల్లి యాదవ్, బడికెల బాలు యాదవ్, బంకిమీది చక్రధర్ రెడ్డి, కేశిరెడ్డి పెద్ద చిన్నారెడ్డి, అగ్గన్నగారి సుదర్శన్ రెడ్డి, పసుల భరత్, తెలుగు పెద్ద గోవిందు, వడ్డే నరసింహ,జంగ వెంకటయ్య, వడ్డే చెన్న రాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఠాగూర్ బాలాజీసింగ్

**వెల్దండ, డిసెంబరు 19 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గేటు సమీపంలో గురువారం హైదరాబాదు నుండి కల్వకుర్తి వస్తున్న ఆటో హైదరాబాద్‌కు స్కూటీ యాక్టివా పై వెళ్తుండగా ఎదురుగా ఢీకొనడంతో యాక్టివాపై ఉన్న కల్వకుర్తికి చెందిన డి.శ్రీనివాస్ కాళ్లు చేతులకు తగిలి తీవ్ర గాయాలపాలయ్యారు. అదే రోడ్డుపై ప్రయాణిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పీసీబీ మెంబర్ ఠాగూర్ బాలాజీసింగ్ ప్రమాదాన్ని గమనించి తన వాహనాన్ని అక్కడే ఆపి వెంటనే 108సమాచారం అందించారు. క్షతగాత్రుని అంబులెన్సులో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేదాకా ఠాగూర్ బాలాజీసింగ్ ప్రమాద స్థలంలోనే ఉండి మానవతా హృదయాన్ని చాటుకున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

**మహబూబ్‌నగర్‌లో వాహనాల తనిఖీ నిర్వహించిన ఇన్స్పెక్టర్ అప్పయ్య**

**మహబూబ్‌నగర్,డిసెంబరు19 ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దని ఇన్స్పెక్టర్ అప్పయ్య సూచించారు. ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ 1 టౌన్ పరిధిలో ఇన్స్పెక్టర్ అప్పయ్య వాహన తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడిపిన ఒక వ్యక్తిని గుర్తించి, కోర్టులో హాజరుపరిచారు. 2 క్లాస్ మేజిస్ట్రేట్ డి. నిర్మల అతనికి వ్యక్తికి రూ.2 వేల జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్షను విధించారు. ఈ సందర్భంగా 1టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం రోడ్డు భద్రతకు ముప్పు కలిగించే నేరంగా పరిగణించబడుతుందన్నారు. ఇది ఇతరుల ప్రాణాలకూ ప్రమాదాన్ని కలిగించవచ్చని,అందుకే, ఇలాంటి కేసుల్లో కోర్టు కఠినమైన శిక్షలు విధించడం ద్వారా జాగ్రత్తలు తీసుకుంటుందని హెచ్చరించారు.తాగి వాహనం నడపడం మీ జీవితానికే కాకుండా, ఇతరుల జీవితాలకు కూడా ప్రమాదకరమని గుర్తించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**◆ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్**

**నారాయణపేట టౌన్, డిసెంబరు19 ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజనేయగౌడ్ అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు రెగ్యులర్ చేయాలని చేపట్టిన సమ్మె గురువారంతో ఎనిమిదవ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా వంటావార్పు కార్యక్రమం చేపట్టి రోడ్డుపైనే కూర్చొని భోజనం చేసి నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా నాయకులు మద్దతును తెలియజేసి వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమని విమర్శించారు. తెలంగాణ సిద్ధిస్తే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మిక వ్యవస్థను ఉండదని పర్మినెంట్ చేస్తామన్న టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించి తెలంగాణకు 10 సంవత్సరాలుముఖ్యమంత్రిగా పరిపాలించిన కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. ప్రజాపాలన అంటున్న రేవంత్ రెడ్డి అయినా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును కూడాపాలకులు అపహస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వారిని తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ మాట్లాడారు సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ఉద్యమాలతో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అందుకు ఐక్యంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

## రైతులు చట్టాల గురించి తెలుసుకోవాలి

**◆ పేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్**

**నారాయణపేట టౌన్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** రైతులు చట్టాల గురించి తెలుసుకోవాలని నారాయణపేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జలాల్ పూర్ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలు అన్నీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులకు సంబంధించి చట్టాలు ఉన్నాయని తెలిపారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకొని భూమిని బట్టి పంటలు సాగు చేయాలన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ లక్ష్మీపతీ గౌడ్ మాట్లాడుతూ ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 కు ఫోన్ చేయడం వలన మీ యొక్క సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది అన్నారు. అసిస్టెంట్ లిగల్ ఎయిడ్ నాగేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ వాడకం తగ్గించి చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కీర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

## పశుగ్రాసం దగ్ధం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** పొలం నుండి పశుగ్రాసాన్ని ట్రాక్టర్ నుండి ( గడ్డివాము) రైతు ఇంటికి తీసుకు వెళుతుండగా మధ్యలో విద్యుత్ వైర్లు తగిలి గడ్డి కాలిపోయిన ఘటన బొమ్మన్ పాడ్ లో చోటు చేసుకుంది. అందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట మండలం బొమ్మన్ పాడు గ్రామానికి చెందిన గొల్ల పెంటప్ప తన పొలం వద్ద ఉన్న గడ్డివామును ట్రాక్టర్‌లో వేసుకుని ఇంటికి వెళుతుండగా మధ్యలో విద్యుత్ వైర్లు తగిలి నిప్పు చెదిరి ఇట్టకేళ్లకు గడ్డి కాలిపోయింది. దీంతో రైతుకు రూ. 20 నుండి 30 వేల వరకు నష్టం జరిగింది. పశువులకు నిలువ చేసుకున్న పశుగ్రాసం కాలిపోవడంతో తెచ్చుకోవడానికి స్తోమత లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పశువులకు పశుగ్రాశం తెచ్చుకునే స్తోమత లేని నిరుపేద రైతుకు ప్రభుత్వపరంగా ఆర్థికసాయంఅందించే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం గమనించిన కొందరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని చేరుకొని మంటను ఆరిపెందుకు చర్యలు తీసుకున్న చర్యలు చేపట్టారు. అప్పటికే గడ్డ కాలిపోయిందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. కాగా ఎవరికి ఎలాంటి అపాయం జరగలేదు.

# సాంకేతిక వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి

**ప్రతి ఫిర్యాదు పై వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలి : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**

**నారాయణపేట టౌన్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** వార్షిక తనిఖీలు భాగంగా గురువారం నారాయణపేట సర్కిల్ ఆఫీస్ ను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఆఫీస్‌లో నిర్వహిస్తున్న పలు రకాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్లో ఉన్న గ్రేవ్ కేసులు, కేసుల పురోగతి పెండింగ్ ఉన్న కేసులను తగ్గించాలని సూచించారు. కేసుల దర్యాప్తు, వర్టికల్స్ పనితీరు కేసుల వివరాలను ఆన్లైన్ నిర్వహణ వంటి వాటిని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని పోలీస్ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్లో వర్క్‌లోడ్ ఎక్కువగా ఉంటుంది. కావున ప్రతి ఒక్కరు కష్టపడి బాగా పని చేయాలని అందరూ లోకల్ పరిధిలోనే ఉండాలని సూచిం చారు. నూతనంగా వచ్చిన కానిస్టేబుల్స్ అంద రు పోలీస్ స్టేషన్లో ప్రతి వర్టికల్స్ పై అవగాహన కలిగి ఉండి రొటేషన్ వైస్ గా అన్ని విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే సాంకేతిక వ్యవస్థపై దృష్టి సారించాలని, పోలీస్ శాఖలో వస్తున్న నూతన ఆప్స్, సిసిటి ఎన్ఎస్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.పాత వాహనాలను, కండం అయిన వాటిని పోలీస్ హెడ్ క్వాటర్స్‌కు పంపించాలని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోశాంతి భద్రతలు పరిరక్షిస్తూ ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలని, ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని తెలిపారు.పాత నేరస్థులపై నిఘా ఏర్పాటు చేయాలని ప్రతిరోజు వారిని తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవాలి, సైన్ బోర్డ్స్, స్పీడ్ బ్రేకర్స్ సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాటు చేయాలని అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని, ఆకస్మికంగా నాక బంది నిర్వహించాలని మరియు ఆరుబయట మద్యం సేవించే వారిపై, మహిళలను వేధించే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు పూర్తి భరోసా ధైర్యం ఇచ్చేలా పోలీసు ఇన్వెస్టిగేషన్ నిర్వహించాలని అన్నారు.ఫిర్యాదుదారులకు కేసుకు సంబంధించిన పూర్వపరాలను ఎప్పటికప్పుడు బాధితులకు వివరిం చాలని తెలిపారు.కేసుల దర్యాప్తు బాగా నిర్వహిస్తేనే నేరాల్లో నింధితులకు శిక్షలుపడతాయని తద్వారా నేరాలు తగ్గుతాయని అన్నారు నేరస్తులకు శిక్షలు పడేలాపని చేయాలని సిబ్బందికి తెలిపి నారు. ఫిర్యాదులపై త్వరగా స్పందించక పోయిన,కేసుల దర్యాప్తులో అలసత్వం చూపిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిర్యాదు దారుడు నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చి పిర్యాదు చేసేలా స్నేహపూర్వక వాతావరణ కల్పించాలి అన్నారు. బాధితుడు జిల్లాలో ఏ పోలీసు స్టేషన్ కైనాఏ సమయంలోనైనా,ఏవిధంగానైనా పోలీసు స్టేషన్‌కు వస్తే త్వరితగతిన స్పందించి ఒకే రకమైన స్పందన చూపాలని బేసిక్, విజువల్ పోలీసింగ్ నిర్వహించాలని సిబ్బందిని కోరారు.ప్రతి ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేయాలని, ఫ్రీ ఫైర్ రిజిస్టర్ చేయాలని అన్నారు. సమస్యలు సృష్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలి అని అలాంటి వారిపై నిఘా ఏర్పాటు చేసి అవసరమైతే షీట్స్ఓపెన్ చేయాలని అన్నారు. దొంగతనాల నివారణకోసం సీసీ కెమెరాలను పెంచడం మరియు ప్రజలకు అవగాహన కల్పిం చాలని సూచించారు. మత్తు పదార్థాలు, గుట్కా, గంజాయి లాంటి నిషేధిత పదార్థాల అమ్మకాలు, అక్రమ రవాణా నిరోదిం చడం కోసం సిబ్బంది బాగా పని చేయాలని అన్నారు. మహిళల రక్షణ కోసం, సైబర్ నేరాలపై షీ టీమ్స్, లోకల్ పోలీసులు ప్రజ లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనితెలిపారు.ప్రాపర్టీ నేరాలుజరగకుండా విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించా లని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు,రాజు, కృష్ణ దేవ్, రేవతి, ఎఎస్సైలు, పోలీస్ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

# జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**కల్వకుర్తి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన 2025 సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను గురువారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఆలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి దేవికి జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, ఆలయ చైర్మన్ జూలూరు రమేష్ బాబు, ఆర్యవైశ్య నాయకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన క్యాలెండరును జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలోని అన్ని మండలాలకు గ్రామాలకు జిల్లా క్యాలెండర్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, కోశాధికారి శివ్వ జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుర్లపల్లి శ్రీధర్, పీఆర్ఓ మిర్యాలరాజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివాలయం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, కల్వ రమేష్, వాస శేఖర్, మేడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, జూలూరి బాలస్వామి, గుండ కృష్ణయ్య, వాసవిక్లబ్ సభ్యులు ఆంజనేయులు, అశోక్, బాదం రాఘవేందర్, అవోప కార్యదర్శి శోభన్ బాబు, జిల్లా పిఆర్ఓ సభ్యులు కొండూరు కృష్ణయ్య, దాచేపల్లి మనోహర్, దాచేపల్లి తిరుపతయ్య, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి పాపిశెట్టి శ్రీనివాస్, గందె రవి, రైస్ మిల్లర్లు ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆర్యవైశ్య మహాసభ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

# జూనియర్ కళాశాలను అకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ

**కల్వకుర్తి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను నాగర్‌కర్నూల్ జిల్లా డీఈఓ వెంకటరమణ గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ రామిరెడ్డి, అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి కళాశాలకు సంబంధించిన విద్య ప్రణాళికలను, రికార్డులను, విద్యార్థుల హాజరు, యూనిట్ టెస్టు పరీక్షల రిజల్ట్స్, వార్షిక పరీక్షలకు ప్రిపరేషన్, విద్యార్థుల లాంగ్ ఆబ్సెంట్ గురించి తనిఖీ చేసి అడిగి తెలుసుకున్నారు.ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థుల యొక్క సంఖ్యను పెంచడమే కాక ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు. కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగర్ కర్నూల్ జిల్లాలో చక్కటి విద్యను అందిస్తూ ప్రిన్సిపాల్ లెక్చరర్స్ సమిష్టి కృషితో మంచి ఫలితాలను సాధిస్తుందని, భవిష్యత్తులో జరగబోయే వార్షిక పరీక్షల్లో 100 ఉత్తీర్ణత తేవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడుతూ విద్యార్థులు భయం లేకుండా బాగా చదవాలి, కళాశాలకు రెగ్యులరుగా హాజరై మంచి ఉత్తీర్ణత తీసుకొని కల్వకుర్తి కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. ప్రిన్సిపాల్ రామిరెడ్డి కళాశాలలో విద్యార్థులకు చక్కటి యూనిఫామ్, ఐడి కార్డ్స్ ఏర్పాటు చేసివిద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించేలా కృషి చేస్తున్నారని డీఈఓ అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణు, సదానందం గౌడ్, మహబూబ్ అలీ, మల్లేష్, భీమేష్, రాజేష్, బాలరాజ్, శ్రీనివాస్, మల్లికార్జున్, పరశురాం, శ్రీనివాస్, జుబేర్ గిరిబాబు, లక్ష్మీకాంత్ సాగర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటరమణ

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పక్కాగా నిర్వహించాలి

**◆ ఎంపీడీఓ వెంకట రాములు**

**కల్వకుర్తి, డిసెంబరు19 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పక్కగా నిర్వహించాలని కల్వకుర్తి ఎంపీడీఓ వెంకట రాములు పేర్కొన్నారు.గురువారం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకట రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపికలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లఇంటింటి సర్వే నిర్వహించి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసుకొని, ఇంటి ఫోటో, లబ్ధిదారుల ఫోటో తీసుకుంటున్న సర్వే అధికారులకు ఎంపిడిఓ తగుసూచనలు అందజేశారు. కార్యక్రమంలో మార్చాల పంచాయితీ కార్యదర్శి రమేష్, సీనియర్ అసిస్టెంట్ ఫిరోజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిజముద్దీన్, భారతమ్మ, భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

# ప్రపంచ మేధావిని అవమానపరచడం అమిత్ షా అవివేకం

**అంబేద్కర్‌ను అవమానపరిస్తే రాజ్యాంగాన్ని అవమానపరచడమే : కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్**

**కల్వకుర్తి, డిసెంబరు19 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిబంధనలకు లోబడి నిర్వహిస్తున్న పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానపరచడం విచారకరమని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పార్లమెంటులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక పాలమూరు చౌరస్తాలో గురువారం ధర్నా, రాస్తారోకో దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్ కుమార్, యెన్నం భూపతిరెడ్డిలు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ అవమానపరచడం బాధాకరమైన విషయమని వారు పేర్కొన్నారు. అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. విశాల భారతదేశానికి మహోన్నతమైన రాజ్యాంగ నిర్మించిన ఘనత బాబాసాహెబ్ అంబేద్కర్ అని వారి సందర్భంగా గుర్తుచేశారు. దేశంలో మనువాద పాలన కొనసాగుతుందని వారు దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, చిమ్ముల‌శ్రీకాంత్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, గోరేటి శ్రీనివాస్, ఎజాస్, మసూద్, మబ్బు రామరాజు, మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.



అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

## అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు

**వెల్దండ, డిసెంబరు 19 ప్రభాతవార్త:** విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని ఎస్ఐ కురుమూర్తి అన్నారు. అపరచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా అవసరమని ఎస్ఐ కురుమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ అపరచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దని, మంచిగా చదువుకోవడం వల్ల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని మనసులో ఉంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, సెల్ ఫోన్లకు బానిసకాకుండా ఎంత దూరం ఉంటే అంత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి పాఠశాలలు కళాశాలలు ఎంతో మనకు నేర్పిస్తాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



## విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం..

వ్యత్యాసం రావొద్దని కలెక్టర్ ఆదేశించారు.పాఠశాలలో వసతులు, విద్యార్థుల ఆహార మెనూ, వంటగది,పరిసరాలను మధ్యాహ్న భోజనానికి వుం దేందుకు వినియోగించే కూరగాయలు బియ్యాన్ని, విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనంను పరిశీలించి, రోజు వారి మెనూని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ తీసు కుని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూ పక్కాగా అమలు చేయాలని, మధ్యాహ్న భోజనం వంట సిబ్బంది కి స్పష్టం చేశారు.విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరును పరి శీలించిన కలెక్టర్,అధికారులు నిరంతరం ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, ఏదేని లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని,విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత మండల స్థాయి అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఊక చెట్టు వాగే మాకు జీవనాధారం

మొదటి పేజీ తరువాయి భాగం..

తరలింపు చేయడం లేదని అధికారులకు వివరించారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఇసుక రీచ్ లను రద్దుచేసి ఈ ప్రాంత రైతులకు మేలు చేయాలని అధికారులను కురుమూర్తి గ్రామ రైతులు కోరారు. ఇసుక తరలింపు వల్ల వచ్చే లాభ నష్టాలను రైతుల నుంచి తెలుసుకునేందుకు రావడం జరిగిందని రైతులు చెప్పిన ప్రతి విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో తహసిల్దార్ ఎల్లన్న ,ఎస్సై ఆర్ శేఖర్, సీనియర్ అసిస్టెంట్ క్రాంతికుమార్‌గౌడ్,ఆర్ఐ శశికిరణ్,కురుమూర్తి గ్రామరైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, డా.రాము,సురేష్, బాలస్వామి, నరేందర్‌జి ఉన్నారు.

## ఐటి టవర్ నిర్మాణానికి రూ.22కోట్లు మంజూరు

మొదటి పేజీ తరువాయి భాగం..

టెండర్లు పిలిచి పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, విద్య, వైద్యం, వ్యవసాయం, నిరుద్యోగంపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు.దీనికిగాను ఏడాదికి రూ. 20వేల కోట్ల చొప్పున మొత్తం ఒక లక్ష కోట్ల రూపాయలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో అభివృద్ధి పనులు చేసేందుకు ఖర్చు పెట్టబోతున్నారని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులు, పెండింగ్ ప్రాజెక్టులు, వాటి కింద సాగు వివరాలను ముఖ్యమంత్రికి అందజేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం పలు ప్రాజెక్టుల కింద ప్రాజెక్టులలో ఉన్న నీటి కేపాసిటి కంటే తక్కువగా సాగు అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని పలు ప్రాజెక్టులకు సంబంధించి నీటి సామర్థం పెంచడంతోపాటు ప్రాజెక్టుల కింద సాగు అంచానను కూడా పెంచేలా వాటిపైతీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేసి త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు.గత పది ఏళ్లలో ఉమ్మడి పాలమూరు జిల్లాను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, అందుకే ప్రజలు ఆప్రభుత్వాన్ని ఆ పార్టీని తరిమికొట్టి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు.కాబట్టి ఈ ప్రాంతాన్నిఅభివృద్ధి చేయాలనే కాంక్షతోనిరంతరం ఉమ్మడి పాలమూరు జిల్లాపై దృష్టి సారించారని తెలిపారు.ఈ అవకాశాన్ని మేమంతా సద్వినియోగం చేసుకొని ఉమ్మడి పాలమూరు జిల్లాను అభివృద్ధి చేయడంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అధిక స్థానాల్లో పార్టీ నియమింపబడ్డ నాయకులను గెలుచుకోనున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీరంగాపూర్ మండలానికి చెందిన15 మందికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం అంబేద్కర్ పట్ల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అంబేద్కర్ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. కేంద్ర కేబినెట్ నుంచి నుంచి వెంటనే అమీత్ షాను భర్తరఫ్ చేయాలని చిన్నారెడ్డిడిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, నాయకులు రాగి వేణు, కోళ్ల వెంకటేష్, బాబా పాల్గొన్నారు.

## హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

**నారాయణపేట టౌన్, డిసెంబర్19 ప్రభాతవార్త:** పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిఆర్ డా.బి.ఆర్ అంబేద్కర్ గురించి అవమానకరంగా మాట్లాడాలని నిరసిస్తూ గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్లమెంటులో తనకున్న మనువాదపు అజ్ఞానపు బావజలంతో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను, దేవుడికి మధ్య పోలిక చూపిస్తూ అవమాన పరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. దేవుడిని నమ్మడం అనేది వారి వారి ఇష్టానికి పరిమితమైన అంశం మన్నారు. దేశంలో అగ్రకుల మనవాదుల నరకం నుండి దళిత బహుజనుల జీవితాలకు విముక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే కలిగిందని దేవుడి వల్ల కాదు అన్నారు. దేవుడిని పూజించడం నమ్ముకోవడం వారి వారి వ్యక్తిగత ఇష్టానికి అభిప్రాయానికి సంబంధించిన విషయం అన్నారు. అయోధ్య రాముడి మందిర నిర్మాణం సైతం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనేసాధ్యమైంది అన్నారు. బిజెపి మనువాద నాయకులు గుర్తించుకోవాలన్నారు. బిఆర్ అంబేద్కర్ గొప్ప మహనీయుడైన అంబేద్కర్‌ను విమర్శించడం దేశ ప్రజలను అవమానించడం అవుతుందన్నారు. ఈ విధానమే నిజమైన దేశద్రోకి పాల్పడినట్లు అవుతుందని కాబట్టి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై దేశద్రోహం కింద కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం అంబేద్కర్ జాతర కమిటీని ఎన్నుకున్నారు. అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి ఈశ్వరమ్మ, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు చంటి, ప్రజాకళా మండలి జిల్లా అధ్యక్షుడు బి రమేష్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు టి మాధవ్, మాదిగ జేఏసీ మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు కేపాండునాయకులు హనుమంతు, శేషు బాలరాజ్,రాజు, ఎల్లప్ప, కృష్ణమూర్తి, కురుమప్ప ఉన్నారు.

## అమిత్‌షా వ్యాఖ్యలపై బగ్గుమన్న దళిత సంఘాలు

**◆ కొవ్వతులలతో నిరసన**

**కొత్తకోట డిసెంబరు 19 ప్రభాతవార్త:** పార్లమెంట్ సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాణ కర్త అంబేద్కర్ ను వ్యంగంగా ప్రస్తావించిన సందర్భంగా దళిత సంఘాలు గురువారం బగ్గుమన్నాయి. సాయంత్రం దళితులు పెద్ద ఎత్తున డప్పులు కొడుతూ కొత్తకోట చౌరస్తాలో భారీ ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో క్రొవ్వతులలతో నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి పదివి నుండి వెంటనే సస్పెండ్ చేయాలనీ, పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదలు చేశారు. అంబేద్కర్ లేనిది ఈ రోజు నీకు ఆ పదవి ఆ హోదా ఎక్కడ నుండి వచ్చిందని దళిత నాయకులు ఆరోపించారు. ప్రపంచ దేశాలు మొత్తం బాబా సాహెబ్ అంబేద్కర్ ను కీర్తిస్తుంటే బీజేపీ ప్రభుత్వానికి అంబేద్కర్ అంటే మింగుడు పడడం లేదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వానికి అంబేద్కర్ పై ఏ మాత్రం అభిమానం ఉన్న అమిత్‌షా ను వెంటనే మంత్రి పదవి నుండి తొలగించి అంబేద్కర్ వాదులమని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ చెన్నకేశవ రెడ్డి, శ్రీనుజీ మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు డేవిడ్ రాజ్, ప్రేమదానం, ప్రసాద్, సుభాష్, కిరణ్, నవీన్, సుజ్ఞానం, రాజు, శ్యాం, ప్రవీణ్, నెహ్రు, రవి, కిషన్ నాయక్, మోహన్, విజయ్, డీకే లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.